క్లుప్తంగా

పాఠశాల విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దాతలు

చీమకుర్తి రూరల్: మండలంలో నిప్పట్లపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గార్లపాటి మౌనిక శ్రీనివాసరావు కుమార్తె శ్రీలేఖ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం విద్యాసామగ్రి నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ప్యాడ్‌లు క్యారం బోర్డులు, పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల



పోలేరమ్మతల్లికి పూజలు చేస్తున్న మండల కన్వీనర్ చెంచిరెడ్డి, పార్టీ నేతలు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో మంగళవారం నుంచి పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నసంతర్పణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారికి విద్యుత్ ప్రభ ద్వారా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా ఏడుకొండలు, ప్రచార విభాగం అధ్యక్షుడు తేళ్ల అనిల్ కుమార్, పార్టీ నేతలు, వడ్డెర సంఘం యూత్, అభిమానులు అమ్మవారిని దర్శించుకున్నారు.

22న సామూహిక కుంకుమార్చన

ఒంగోలు మెట్రో: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనదలచిన మహిళలు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ



కరెన్సీ నోట్లతో ముస్తాబైన అమ్మవారు

ఒంగోలు మెట్రో: నగరంలోని గాంధీరోడ్ కన్యకా పరమేశ్వరి వీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం వాసవి కన్యకాపరమేశ్వరిని ఎనిమిది లక్షల ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయలతో సర్వాంగ సుందరంగా ధనలక్ష్మిగా అలకరించారు. ఆలయ తదియారాధన సంఘం సభ్యులు మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేకంగా వాసవీ మాతను అలంకరించి వరలక్ష్మి దేవిగా సామూహిక కుంకుమార్చనలు ఆలయ అర్చకులు శర్మ, ఫణిశర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దగాపడ్డ ఆడబిడ్డ!

- ఏడాదైనా అమలుకు నోచుకోని ఆడబిడ్డ నిధి పథకం
- నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతల హామీ
- 30 వేల మంది లబ్ధిదారులు, రూ.45 కోట్ల బకాయిలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు



చీమకుర్తి రూరల్: 'సూపర్ సిక్స్ అమలు చేశారు.. ఇంకెవరైనా అమలు చేయలేదంటే వారి నాలుక మందమే..' అని సాక్షాత్తు కూటమి సీఎం చంద్రబాబునాయుడు ఒక సభలో పలికిన చిలుకపలుకలివి. తీరా చూస్తే మసిపూసి మారేడు కాయ చేసి ఇచ్చాం అన్నట్లుగా ఉంది ప్రభుత్వం తీరు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కుట్రలో భాగంగా పీ–4 పథకంలోకి ఆడబిడ్డ నిధిని తోసేసి ఇచ్చాం అన్నట్లు కలరింగ్ ఇచ్చి మహిళలను నట్టేట మోసం చేస్తోంది.

గత ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల చేతికి చేరిన డబ్బు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నింటినీ మహిళల అకౌంట్లకే జమ చేశారు.

మండలానికి రూ.45 కోట్ల బకాయి..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఆడబిడ్డ నిధికి సంబంధించిన ప్రస్తావనే లేకపోవడం అనేక అనుమానాలు తావిస్తోంది. 19నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. మండలంలో మహిళా లబ్ధిదారుల సంఖ్య దాదాపు 30 వేలు ఉంటుంది. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున గడిచిన సంవత్సరం బకాయిలు దాదాపు మండలానికి రూ.45 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెల నెలా రూ.1500 చెల్లించాలని మహిళలు కోరుతున్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలనే మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై మహిళలు మండిపడుతున్నారు. అమలు చేయలేనప్పుడు ఎన్నికల ప్రచారంలో ఎందుకు హామీ ఇవ్వాలని మహిళలు నిలదీస్తున్నారు. అధికారమే పరమావధిగా మహిళలను మభ్యపెట్టి ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి గెలిచారని, అధికారం కోసం ఇంతలా దిగజారుతారని మహిళలు కూటమి నేతలపై మండిపడుతున్నారు.

ఆడ బిడ్డ నిధి ఎక్కడ?



కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలల గడుస్తున్నా 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు కూడా రూ.1500 ఇస్తానని ఎన్నికల హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రతి మహిళకు ఎప్పుడు ఆడబిడ్డ నిధి అందజేస్తారు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– తాటి సునీత, ఇలపావులూరు

ప్రభుత్వానిది వంచన..



కూటమి ప్రభుత్వం మహిళలను వంచనకు గురిచేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయ కపోవడం మహిళలను మోస చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– సీహెచ్ కోటేశ్వరి, పడమటి నాయుడుపాలెం

ఎప్పుడిస్తారో చెప్పాలి..



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటి పోయింది. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతో పాటు ఏడాది బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి.

– బొజ్జ కృపమ్మ, పడమటి నాయుడుపాలెం

హామీ నెరవేర్చాలి..



సూపర్ సిక్స్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి. పేద మహిళలకు వెంటనే నెల నెలా రూ.1500 ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మాకు ఇచ్చిన హామీని నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం.

– పులి రమణమ్మ, ఇలపావులూరు

వాచ్‌మన్ ఉద్యోగం చేయాల్సి వస్తోంది..

- ఎమ్మెల్యే సమక్షంలో వాపోయిన మున్సిపల్ కాంట్రాక్టర్లు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో వాచ్‌మన్‌లుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు కాంట్రాక్టర్లు వాపోయారు. రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, డ్రైనేజీ వర్కులు, ఇతర వర్కులు చేస్తున్నా తమను కనీసం ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవటం లేదని, బిల్లుల కోసం నెలలు తరబడి తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాలులో కార్పొరేటర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంగళవారం సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నగరంలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, అందుకు కాంట్రాక్టర్లు సహకరించాలని కోరారు. నగరంలో 499 పనులు చేపట్టామని, అందులో 99 వర్కులు ప్రస్తుతం జరుగుతున్నాయని, మరో 178 వర్కులు ప్రాసెస్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. కాంట్రాక్టర్లు 16, 17 శాతం లెస్సులు వేస్తున్నారని, ఆ విధంగా అయితే పనుల్లో నాణ్యత ఎక్కడ నుంచి వస్తుందని ఆయన ప్రశ్నించారు. టెండర్లు వేస్తున్నారు, వర్క్ ఆర్డర్లు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో కాంట్రాక్టర్లు కొందరు లేచి రూ.కోట్లు ఖర్చు చేసి వర్కులు చేసినా అధికారులు మాత్రం ఒక రకంగా స్పందించినా కింది స్థాయి సిబ్బంది నెలలు తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, వాచ్‌మన్‌లు మాదిరిగా కాంట్రాక్టర్లను చూస్తున్నారన్నారు. పనులు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసి టోకెన్ పూర్తి చేస్తే కాంట్రాక్టర్‌కు కొంత భరోసా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొందరు కార్పొరేటర్లు మరో ఆరు నెలలు మాత్రమే పాలక మండలికి గడువు ఉందని, ఈ లోగా డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. వేగంగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సహకరిస్తే అధికారుల నుంచి పూర్తి స్థాయిలో బిల్లులు ఇప్పించే విధంగా తాను భరోసా ఇస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మేయర్ జి.సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ, ఏసీపీ సుధాకర్, ఎంఈ ఏసయ్యతో పాటు నగర పాలక సంస్థ అధికారులు, అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ పూజలు



అనంత కోదండరామస్వామి మందిరంలో మహిళల పూజలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం సందర్భంగా మంగళ గౌరీ వ్రతాన్ని మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగమూరుడొంక గాయత్రి మందిరం, బాలాజీరావుపేట కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, లాయరు పేట షిర్డీ సాయిబాబా మందిరం, ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజే శ్రీదేవికి, కేశవస్వామిపేటలోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానం, గద్దలగుంట మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి ఆలయం, మంగమూరు రోడ్డు శ్రీ అచలానంద ఆశ్రమంలో గౌరీ పూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకులు మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చన చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.



అభయాంజనేయ స్వామి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

దివ్యాంగులు అభ్యంతరాలు తెలుపుకోవాలి

నాగులుప్పలపాడు: దివ్యాంగుల పెన్షన్ పొందుతూ ఉన్నవారు, ఇటీవల నిర్వహించిన సదరం పునఃపరిశీలన ప్రకియలో అనర్హులుగా నిర్ధారణ అయినవారు అభ్యంతరాలు తెలుపుకోవాలని ఎంపీడీవో తేళ్ల రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైకల్యం తక్కువగా ఉందని వైద్యాధికారులు నిర్ధారణ చేసినవారిలో అభ్యంతారాలు ఉంటే రాత పుర్వకంగా తెలపాలన్నారు. వారి వివరాలను సచివాలయ సిబ్బంది నోటీసు ద్వారా తెలియజేస్తారన్నారు. నోటీసు పొందిన లబ్ధిదారులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆదారాలు, ధ్రువీకరణ పత్రాలతో ఎంపీడీవోకు రాతపూర్వకంగా అప్పీల్ చేసుకోవాలన్నారు. ఆ వివరాలను పింఛన్ పోర్టులో అప్‌లోడ్ చేస్తామన్నారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం వారిని వైద్యశాలకు వెళ్లాలని కోరుతూ మరో నోటీసు జారీచేస్తారని చెప్పారు. అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



ఎస్సై రజియా సుల్తానా

నాగులుప్పలపాడు: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై షేక్ రజియా సుల్తానా తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. విగ్రహాల వద్ద అశ్లీల దృశ్యాలు కానీ ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉండే పాటలు పెట్టరాదన్నారు. మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు రోడ్డు మీదకి రాకుండా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. మద్యం తాగి అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, ఇందుకు విగ్రహాల కమిటీలదే బాధ్యతన్నారు. రౌడీ షీటర్ల కదిలికలపై నిఘాలో భాగంగా మంగళవారం తిమ్మసముద్రం గ్రామంలో ఎస్సై వారి ఇళ్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ

ఒంగోలు సిటీ: సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ అన్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ మోసాలపై మంగళవారం అవగాహన కల్పించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. చదువుకోని వారు, చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారన్నారు. ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు నుంచి అని ఫోన్లు, వాట్సప్‌ల ద్వారా వచ్చే ఫేక్ లింక్స్, ఫేక్ లోన్ యాప్స్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదటగా ఎవరు కూడా వారి డబ్బులను ఊరకనే ఇవ్వరనే విషయాన్ని గుర్తించాలని, అత్యాశకు పోకూడదన్నారు. సైబర్ క్రైమ్‌లో బాధితులైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపడం ద్వారా కొంతమేర నష్టపోయిన డబ్బును తిరిగి పొందచ్చని వివరించారు.

ఓక్లాండ్ విశ్వవిద్యాలయంతో క్విస్ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, గ్లోబల్ స్థాయిలో అధునాతన విద్యను అందించేందుకు అమెరికాలోని మిచిగాన్‌లో ప్రముఖ ఓక్లాండ్ విశ్వవిద్యాలయం, క్విస్ విద్యాసంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగినట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. ఓక్లాండ్ విశ్వవిద్యాలయంలోని డెసిషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ విభాగం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయన్ సుగుమారన్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ క్విస్‌కి చెందిన విద్యార్థులు ఓక్లాండ్‌లో జరిగే ఆర్టికల్ ప్రోగ్రాంలో, ముఖ్యంగా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఏటా దాదాపు 20 మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ ప్రోగ్రాంలో పాల్గొంటే అంతర్జాతీయ స్థాయి కోర్సులు, సర్టిఫికెట్లు రావడమే కాకుండా గ్లోబల్‌గా కూడా గుర్తింపు లభించనుందన్నారు. ఇలాంటి ఒప్పందాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో క్విస్ విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు తెలిపారు. ఎంవోయూ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ జాఫర్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోకరమైన ఎంవోయూ.. అని ఆయన అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కఠారి శంకర్, కోటి యాదవ్

ఒంగోలు సిటీ: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీ కృష్ణ యాదవ ఫెండ్రస్ క్లబ్ ఆధ్వర్యంలో మూడో రోజు మంగళవారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేసినట్లు కమిటీ సభ్యులు కుట్టుబోయిన కోటి యాదవ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కఠారి శంకర్ హాజరై నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బొమ్మరిల్లులో ఉన్న అనాథ పిల్లలతో కేక్ కటింగ్ చేయించారు. అనంతరం అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు పాశం వెంకటేశ్వర్లు, జాజుల శ్రీను, పిగిలి శ్రీను, బోడా రామకృష్ణ, ఆరం శ్రీను, మల్లెబోయిన రాజు, లగ్గాల కోటేశ్వరరావు, చిరుమామిళ్ల గోపి, తమ్మకూరి హనుమంతయ్య, కె.సురేష్ యాదవ్, రావులపల్లి శ్రీహరి, కె.వెంకటసుబ్బయ్య, యన్నాబత్తిన సంతోష్, ఆవులు మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ డే



వేడుకల్లో ఫొటో, వీడియో గ్రాఫర్లు

ఒంగోలు మెట్రో: నగరంలో వరల్డ్ ఫొటోగ్రఫీ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు గుప్తాస్ స్క్వేర్‌లో నిర్వహించిన వరల్డ్ ఫొటోగ్రఫీ డే వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. షుగర్, శ్వాస్వకోశ నిపుణులు డాక్టర్ మహ్మద్ జహంగీర్ సుల్తాన్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కె.వెంకట హరీష్‌కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అసోసియేషన్ సభ్యులకు పోస్టల్ బీమా, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ పత్రాలు, ఫోన్ పే స్కానింగ్ బాక్స్‌లు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దగ్గుపాటి వెంకట్రావు మాట్లాడుతూ అసోసియేషన్ పటిష్టానికి సభ్యులంతా సహకరించాలన్నారు. సభ్యుల సంక్షేమ కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ సెక్రటరీ దొడ్డా చంద్రశేఖర్, ట్రెజరర్ నబీ రసూల్, గౌరవ సలహాదారులు ఉదయ్ హరి, ఉపాధ్యక్షుడు ఉప్పుటూరి చంద్రశేఖర్, ప్రసాద్, రమణ మాధవరావు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో విత్తనశుద్ధి తప్పనిసరి



వరిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కిషోర్‌బాబు



రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న నరసింహులు

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో విత్తనశుద్ధి చేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ నరసింహులు అన్నారు. మండలంలోని అల్లూరులో వరి వేసే రైతులకు విత్తనశుద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. రైతుల కోసం సామూహికంగా బీజామృతం తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుంటే మొలక శాతం బాగా వస్తుందని చెప్పారు. భూమి నుంచి సక్రమించే తెగులు నివారిస్తుందని వివరించారు. పంట వేసిన 25 రోజుల వరకు రక్షణ కల్పిస్తుందని చెప్పారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ సూచనలు మేరకు తగినన్ని ఎరువులు వాడుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతితో తయారు చేసిన కషాయాలు వాడుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పట్టపు సురేష్, మాధురి, అరుణ పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

నాగులుప్పులపాడు: ఎరువుల కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెట్ చేసినా అటువంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏవో పీ వెంకట్రావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఈదుముడి, ముప్పాళ్ల గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఫిర్యాదు చేసుకోవడానికి నేడు బుధవారంతో గడువు ముగుస్తుందన్నారు. అర్హత ఉండి ఎవరికైనా అన్నదాత సుఖీభవ డబ్బులు పడకపోతే సాయంత్రంలోపు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గాని, గ్రామ వ్యవసాయ అధికారిని కలవాలని తెలిపారు. మండలంలో ఎరువులు కొరత లేకుండా అన్ని సొసైటీలకు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు పెడుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పురుగు ఉధృతిని అరికట్టాలి

కొత్తపట్నం: వర్షాకాలం సీజన్ వచ్చినందున వరిలో పురుగు ఉధృతిని అరికట్టినప్పుడే పంట దిగుబడులు బాగా వస్తాయని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్ బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్లూరులో ఆయన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను వినియోగించుకుని వరి పంటలను సాగుబడి చేసుకోవాలని సూచించారు. వరి పైరులో వచ్చే దోమకాటు, తెగుళ్ల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు తమ ఆధార్ ద్వారా సరిచూసుకోవచ్చుని, ఆధార్ ఇనాక్టివ్, ఆధార్ మిస్ మ్యాచింగ్, ఎన్‌పీసీఐ పెండింగ్ వంటి కారణాలు ఉంటే ఈ నెల 20లోపు ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారి అజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు కోటేశ్వరరావు, నాగలక్ష్మి, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ మధుప్రసాద్ పాల్గొన్నారు.